సంఖ్య: II/509 రాగం : బౌళి
కీర్తన : పరమపురుషుడీ బాలుడట

## బౌళి

**82** పరమపురుషుఁ డీ బాలుఁ డఁట
హరవిరుంచులు మొక్కేరదివో వాకిటను ||పల్లవి||

దేవుఁ డితఁడు సర్వదేవతల కొడయఁడు
వేవేలు వేదములచే వేద్యుఁ డితఁడు
దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ
ఏ విధము నోఁచిరి వీ రెంత భాగ్యవంతులో ||పర||

అంతటాఁదా నున్న వాఁడు అరయ స్వతంత్రుఁడు
అంతము నాదియు లేని ఆదిమూరితి
వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి
దొంతరకొడుకైనాఁడు తొల్లి వీరేపుణ్యులో ||పర||

ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు
కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు
మందగొల్లెతల కెల్ల మరఁది దా నై నాఁడు
ఇందరు నిందరే వీరి కెన్నటి సంబంధమో ||పర||

**ఉపోద్ఘాతము:**

దేవకీగర్భస్థ శిశువై యశోదాదేవితో అల్లారుముద్దుగా పెరిగి నందుని ఇంట నవ్వులు పూయిస్తున్న ఈ బాలుడు యెవరనుకొంటున్నారు. సాక్షాత్తు పరమాత్ముడు. అదిగో మీకు కనబడరుగాని పరమశివుడు పరమేష్ఠి, ఆబాలుని వాకిట నిలబడి మొక్కుచున్నారు అని అద్భుతంగా శ్రీకృష్ణ రసాయనం త్రాగిస్తున్నారు, అన్నమయ్య. ఇదే కీర్తన యెన్నోసార్లు యెన్నో చిన్న చిన్న మార్పులతో పాడుకొని వుంటాం. పల్లవి మాత్రం మరువలేనిదిగా వుంటుంది.

ఇందిరానాథుడైన ఈతడే మన ఇహపరములకు అధిపతి. నేడు వేంకటాద్రిపై కాపుండి మనరక్షకుడు రేపల్లెలోని గొల్లెతలందరితో ఒకేవావి (చుట్టరికము) వున్నదితనికి. వారికి మరిది. వీరి సంబంధము ఈనాటిదనుకొంటున్నారా?

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! ఈ బాలుడే, పరమపురుషుడట (పరమాత్ముడట). ఇదిగో ఇతని వాకిటను హరవిరుంచులు (పరమశివుడు, బ్రహ్మదేవుడు) నిలుచుండి వానికి మొక్కుచున్నారు.

దేవుడితడు (ఇతడే పరబ్రహ్మ). దేవతలందరికీ ఒడయడు (నాథుడు) యీతడే. ఈయన తత్త్వము తెలియాలంటే వేదములన్నింటినీ ఆకళింపు చేసికొనవలసిందే. వారి పూర్వజన్మ సుకృతమువలన దేవకీ వసుదేవులకు కన్నబిడ్డయై జన్మించాడు. ఇంత సౌభాగ్యమును స్వంతం చేసికొనుటకు వీరు నోచిన విధమెట్టిదో కదా! వీరెంత భాగ్యంతులో కదా! ఏమని పొగడగలము?

ఈతడు అంతటాతానున్నవాడు (సర్వవ్యాపకుడు). సర్వస్వతంత్రుడైనవాడు. ఆది మధ్యాంతరహితుడు. ఆదిమూర్తి (ఆదిపురుషుడు). వంతుకు (వంతులు కొద్దీ) యశోదనందగోపులను నవ్వులతో ముంచే ఈ బాలుడు దొంతర కొడుకైనాడు (పరంపరగా వచ్చిన పుత్రుడైనాడు). తొల్లింటి వీరే పుణ్యములు చేశారో కదా!

ఈ బాలుడే ఇందిరాదేవి భర్తయట. జీవులకు ఇహపరములనొసగే నాయకుడు ఇతడే. నేడు కలియుగంలో సామర్థ్యముతో శ్రీవేంకటాద్రిని యేలుతున్న శ్రీవేంకటేశ్వరుడితడే. గొల్లెతల మందకెల్ల (రేపల్లె గొల్లభామలకు మూకంతటికీ) తానొక్కడే మరది అయినాడు (చెల్లెలి మగడు అయినవాడు). ఇందరూ యిందరే. వీరితో ఇది ఏనాటి బంధమో కదా!

**పద్యవివరణ:**

చం॥ **అరయగ వీడు బాలుడటె ఆదిమపూరుషుడున్ పరాత్పరుం-**
**డిరుగడ బ్రహ్మయున్‌హరుడు యేపుగమొక్కిరి నిల్చివాకిటన్**
**మురిపెము దీర్చెదేవకికి ముద్దులబిడ్డయశోదకాయెరా**
**తిరుమలరాయడే వెలసె తీర్చినకృష్ణుడు చిత్తచోరుడున్.**